# మానవుడు

**కథానిక**

**శ్రీమతి బెహరా సాహితి**

జ్ఞానేశ్వరరావుకి బళ్లకొద్దీ బాధలు; ఓపలేని కష్టాలు, ఆపలేని దుఃఖాలు అణచలేని సమస్యలు, అణగార్చేస్తున్న దరిద్రం. అన్నీ యింకా ఎన్నో అతని జీవితాన్ని బహుదుర్భరం చేశాయి. ఒకానొక చెడు (మంచి) ముహూర్తం చూసుకుని అతడడవికి పరిగెత్తాడు, పీఠం వేశాడు, హఠం పట్టాడు, మహా నిష్ఠగా సాగించాడు తపం.

"ఏమైనా సరే, సాధించాలి. ఆ దేవుడ్ని భూమికి దించాలి, అతగాడి చిటికిన వేలు పట్టుకుని ఈ సంసార జలధిని. దాటాలి అబ్బఅబ్బ అమ్మ బాబోయ్! ఒకటా, రెండా ఎన్ని సమస్యలు, ఎన్నికిష్టాలు, హోరిభగవంతుడా అడగాలి ఐశ్వర్యాలు, కోరాలి కోటి కోట్లు, పొందాలి పొందు రంభాద్యప్సరసల మించిన కనకలతని. సంఘంలో పరువు, ప్రతిష్ఠ ఐశ్వర్యం, హోదా, సుఖాలు అమర సుఖాలు అన్నీపొందాలి, పొంది తీరాలి, ఎన్నేళ్ళు గడిచినీ, ఏమైపోనీ ఈ పట్టు వదులుతానా. చూస్తాను? "ఎలా ప్రత్యక్షం కాడో చూస్తాను." ఇదే అతని అకుంఠిత దీక్ష భక్తిమాటనే చెప్పలేను గాని ఓర్పులో అతను భగీరధుడే అయ్యాడు, నిరీక్షించాడు శబరి కంటె ఎక్కువగా.

లెక్కెందుకుగాని గడిచా యెన్నో వత్సరాలు.

"వత్సా!"

కళ్ళు తెరిచే సరికి ఎదురుగా, చిరునవ్వుతో దేవుడు.

సాష్టాంగ పడాలన్న సభ్యతని మరచిపోయాడు. చేతులు జోడిద్దామంటే చైతన్య రహితుడే అయ్యాడు ఓ క్షణం సేపు, నోరారా కీర్తిద్దామంటే పెదవులు ఆడాయికాదు, అతని సర్వాంగాల్లోనూ, హృదయం లోలోతులలోనూ ఒక్కటే వినపడుతోంది. "అబ్బ! ఎన్నాళ్లకి! ఎంత కష్టపడి సాధించాను! ఎన్ని సంవత్సరాలు గడిచాయో! అని తరసాధ్యమైన పని అమూల్యకాలాన్ని వెచ్చించి అలనాటి మునుల కోవన నిలబడగలంతటి మహత్కార్యం".

అతనికి గడచినకాలం మహాదీర్ఘమై కంటికి కనుపించ నంతదూరం సాగిపోయింది. తను పడిన కష్టం మహార్ణవమంత, మరి యింత కష్టపడి ఇంత శ్రమపడి....

"ఏమిటి నాయనా నీ కోరిక" మృదువుగా నవ్వుతూ అడిగాడుదేవుడు.

బుర్ర గోక్కున్నాడు, భక్తుడు "అదే స్వామీతెలియటంలేదు, ఏమడగాలా అని ఆలోచిస్తున్నాను, ఎందుకంటేఎంత శ్రమకోర్చి నీ దర్శనం పొందానో నీకు తెలుసు! మనిషినే గాని రాక్షస ప్రయత్నం చేశాను. ఇంతా కష్టపడి, ప్రపంచంలో ఎవరూ పొందలేని అపూర్వమైన

నీ దర్శనమూ పొంది నువ్విప్పుడు వరమిస్తానంటే ఏం కోరుకోవాలో తెలియటం లేదు. కోరేది మళ్లీ అలాటిలాటి అలగా వరం కోరుకోకూడదు గదా! ఇంత దివ్యమైన అవకాశం వచ్చినపుడు బ్రహ్మాండమైన వరమే కోరుకోవాలి నిన్ను. అదే ఆలోచిస్తున్నాను ఏం కోరనా "అని" అన్నాడు. ఆలోచన ఎంతకీ తెగటం లేదు. నిలబడేవున్నాడు దేవుడు. "కాసేపు కూర్చోండి స్వామీ! కాళ్ళు పీకుతాయేమో" అన్నాడు.

"ఫర్వాలేదులే! పడుకుని పడుకుని వీపు పట్టేసింది".

ఆలోచించాడు ఆలోచించాడు, మహా ఆలోచన. ఎంతకీ తెమలటం లేదు. అపూర్వమైన వరం! ఏదీ అతని దృష్టికి ఆనటం లేదు.

"నువ్వు ఎన్నాళ్ళు తపస్సుచేశావో అన్నాళ్ళూ ఆలోచిస్తావు కాబోసు!" కొంటెగా నవ్వాడు దేవుడు.

"అబ్బె బ్బే!" అని మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

"పోనీ, ఓ పని చెయ్యి?"

"ఏమిటి స్వామీ?"

"నీకు పది సంవత్సరాలు టైమిస్తాను. ఆ తర్వాత కోరుకో నీకేం కావాలో!"

"మరి అంతవరకు తమరు".

"నాకెంత! ఆకాలం నాకు రెండు నిముషాలతో సమానం. ఇక్కడేకాసేపు పచార్లు చేస్తాను. నువెళ్ళిరా!".

"ఎంత దయస్వామీ నీకు! మరి నేవెళ్లొస్తాను, నేను సాధించలేనిదీ, ఏనాటికీ పొందలేనిదీ మహాద్భుతమైన వరమొకటి కోరుకుంటాను. వస్తాను స్వామీ, నేనిక్కడే మళ్ళీ నిన్నుకలుసుకోడం". పరిగెత్తాడు అడవుల్లోంచి.

గడిచాయి పది సంవత్సరాలు.

జ్ఞానేశ్వరరావు వచ్చాడు అదే స్థలానికి. అతని ముఖంలో దైన్యం. సంశయం, బాధ, భయం ఏమీ లేవు. ఆకారం చూస్తే రాజవరి కొడుకన్నంత ధీమా కనబడుతోంది. వేషంకుబేరుడి తమ్ముడిలా వున్నాడు.

"ఏమయ్యా, ఏం వరం కావాలి?" ఆత్రుతగా పల్కరించాడు దేవుడు.

చిరునవ్వినవ్వి. స్థిరంగా, నిదానంగా చెప్పడం మొదలెట్టాడు జ్ఞానేశ్వరరావు "కోటీశ్వరుడినవాలని కోరదామను కున్నాను స్వామీ, సిగ్గు-లజ్జ, దయదాక్షిణ్యం-పాపం పుణ్యం ఇవి వదిలేసి చూశాను, అఖండైశ్వర్యం నాకు సంప్రాప్తించింది. శరీరాన్ని వంచాను, అతి నిద్ర, అమిత భోజనం వదిలేశాను ఉక్కు కడ్డీలా వుంది నా శరీర మిప్పుడు. చింతలు, వంతలు నన్ను చేరకుండా అంతదూరంలో అట్టే పెట్టాను. నవ్వుతూ వుండగలను. నాలుగు కాలాలపాటు మనగలను. వినయం! ఏకాగ్రత అలవర్చుకున్నాను. జ్ఞాన సముపార్జనకి అవిఎంత అవసరమో తెలిసింది. రేపు మరో గ్రహయానం మేము చేస్తే, అందులో నా చేయి కూడా వుందన్న సంగతి నీకు వినయంగా మనవిచేస్తున్నాను ఇంత ఎదగడానికి పట్టుదల, కృషికారణం, ఇంతకీ

చెప్పొచ్చేదేమిటంటే నేనిప్పుడు నిన్నేమి కోరుదామనుకున్నానో అన్నీ సాధించాను. మరి."

దేవుడు చటుక్కున అడ్డొచ్చాడు.

"పోనీ చావులేకుండా వరమివ్వనా?"

పకపక నవ్వాడు జ్ఞానేశ్వరరావు.

"చెప్పాగా స్వామీ, చాలావరకు అది నాచేతిలో వుంది. అంతగా మరణం వస్తే రానీ మరీ అలాచావులేక వుండిపోవాలంటే బోర్ కదూ!"

"పోనీ జన్మరాహిత్యం"

"అదసలే వద్దు స్వామీ మళ్ళీమళ్ళీ పుడతాను కష్టం-సుఖం అన్నీ అనుభవిస్తాను. ఏమీలేకుండా ఎక్కడో పడుండటం ఏంబాగుంటుంది స్వామీ!"

"పోనీ ఆత్మజ్ఞానం ఉప .."

"అంత పెద్ద మాటెందుకు స్వామీ, తెల్సుకుని నేనేం చేస్తాను? మరొకడికి చెప్దామన్నా, అర్థం చేసుకునే వాడెవడూ ఈ భూప్రపంచంలో లేడు సాటివాడి ఉన్నతికి పనికిరాని జ్ఞానం. నాకెందుకు ప్రభూ."

"అయితే ఏమంటావు?"

సారీ! సో సారీ స్వామీ నిన్ను రప్పించడమే గాక, ఇక్కడ వెయిట్ చేసేట్టు చేశాను, క్షమించు నిన్ను కోర దగ్గ వరమేదీ నాకు కనిపించలేదు."

ఆశ్చర్యంగా ఓ నిముషం చూసి, ఆ తర్వాత పెద్దగా నవ్వడం మొదలెట్టాడు దేవుడు. ఆ నవ్వు లో సంతోషం, తృప్తి కనిపించాయి.

"మరి నే వెళ్ళిరానా? నవ్వుతూనే అడిగాడు.

"అవశ్యం, మీకు శ్రమ యిచ్చినందుకు క్షమించు." అని మరోసారి క్షమాపణ, వేడుకుని, వెళ్లాడు జ్ఞానేశ్వరరావు.

దేవుడు గారి దేవేరి విభ్రాంత పోతూ అడిగింది.

"ఏమిటా నవ్వు దేవదేవా?" అని.

"సంతోషం, దేవీ సంతోషం" అన్నాడు.

ఎందుకని స్వామీ అంత సంతోషం ఈ మధ్యకాలంలో నేనెప్పుడూ చూసెరుగనే" అంది కళ్ళు విప్పార్చి చూస్తూ.

"అదా! ఎందుకింత సంతోషమంటే నేనివాళ ఒక మానవుడిని చూశాను దేవీ ఒక నిజమైన మానవుడిని!" అన్నాడు ఇంకా నవ్వుతూనే.